

విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206



చైనాలో 'టెంపరరీ పిల్లలు'.. ఏమిటీ ట్రెండ్?

సంపుటి:-01, సంచిక:-158, గురువారం 05-11-2026, పేజీలు:-4, వెల: 2/-, ఎడిటర్:- ఎల్లని రాజేశ్వర్ గౌడ్ , పబ్లిషర్స్ : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు



- కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ ఘాటు విమర్శలు
- కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ, బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు
- తెలంగాణకు కేంద్రం ఏం ఇచ్చిందని అమిత్ షాను ప్రశ్నించిన కేటీఆర్
- రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై విమర్శలు

కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న పార్టీలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ - మిగతా 2 లో

పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి



- చంద్రబాబుకు రేవంత్ రెడ్డి గురుదక్షిణ ఇస్తున్నారన్న కవిత
- నదీ జలాల వినియోగంపై ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని విమర్శ
- పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని సూచన

పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి - మిగతా 2 లో



హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు యాదవ సోదరులు సంపూర్ణ సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. మూసీ పునరుజ్జీవనం, మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులతో హైదరాబాద్‌ను దేశంలోనే ఆదర్శ నగరంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా యాదవ సోదర సోదరీమణులకు సదర్ ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో, శాంతిభద్రతల పరిరక్షణలో యాదవుల పాత్ర ఎంతో కీలకమని ప్రశంసించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన వారిని యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని గుర్తుచేశారు.

యాదవుల హక్కుల పరిరక్షణ బాధ్యత నాదే

యాదవుల ఆత్మగౌరవం, హక్కుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసే బాధ్యత తనదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నగర అభివృద్ధిలో యాదవులు భాగస్వాములు కావాలని, హైదరాబాద్‌కు జాతీయస్థాయిలో మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు.

"డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా".. ఎన్నికల ఫలితాలతో స్వరం మార్చిన ట్రంప్

- అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు ఘోర పరాజయం
- హౌస్, సెనెట్ రెండింటినీ కైవసం చేసుకున్న డెమోక్రాట్లు
- ఫలితాల తర్వాత దిగొచ్చిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఓటర్లు రిపబ్లికన్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పారు. ఎన్నికల ఫలితాలకు ముందు వరకు డెమోక్రాట్లు - మిగతా 2 లో

ప్రజల కడుపు మాడుతున్నా.. సైనిక ఖర్చులకే పాకిస్థాన్ పెద్దపీట!

- ప్రజారోగ్యం, ఆహారం కంటే సైనిక ఖర్చులకే పాకిస్థాన్ ప్రాధాన్యత
- 2026-27 బడ్జెట్‌లో రక్షణ రంగానికి భారీగా పెరిగిన కేటాయింపులు
- ప్రపంచ ఆకలి సూచీలో పొరుగు దేశాల కన్నా పాక్ వెనుకబాటు
- గోధుమల సేకరణ విఫలమవడంతో ఆహార కొరత, దిగుమతుల భారం
- సైన్యంపై 56 రూపాయలు ఖర్చు చేస్తూ, ప్రజల ఆరోగ్యంపై కేవలం రూపాయి వ్యయం



పాకిస్థాన్‌లో ప్రజలు తీవ్రమైన ఆకలి, పోషకాహార లోపంతో బాధపడుతుంటే.. అక్కడి ప్రభుత్వం మాత్రం ప్రజారోగ్యం, ఆహార భద్రత వంటి కీలక రంగాలను విస్మరించి సైనిక సామగ్రి కొనుగోలుకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇటీవల విడుదలైన ఒక నివేదిక ప్రకారం పాక్ ప్రభుత్వం తన బడ్జెట్‌లో రక్షణ రంగానికి భారీగా నిధులు కేటాయించి, ప్రజల అవసరాలను గాలికొదిలేసింది. ఈ వివరాలను - మిగతా 2 లో

ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి మద్యం వాసన వచ్చేది



- భగవంత్ మాన్‌పై రాహుల్ గాంధీ తీవ్ర వ్యక్తిగత విమర్శలు
- రోజూ మద్యం సేవించే సీఎం డ్రగ్స్‌పై పోరాడలేరని వ్యాఖ్య
- పంజాబ్ పాలన కేజ్రీవాల్, అమిత్ షా చేతుల్లో ఉందని ఆరోపణ
- రాష్ట్రంలో పరిశ్రమలు పెరిగితేనే యువతకు ఉపాధి లభిస్తుందని సూచన
- ప్రధాని మోదీతో చర్చకు తాను సిద్ధమంటూ మరోసారి సవాల్

సోషల్ మీడియాలో కాదు దమ్ముంటే సభలో చర్చకు రండి



- మోదీ బహిరంగ చర్చకు రావాలన్న గాంధీ
- ఘాటుగా స్పందించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని స్పీష్టీకరణ
- సమాధానాలు వినకుండా సభ నుంచి వాకౌట్ చేయడంపై విమర్శలు
- ఆధారాలతో చర్చకు వచ్చి, ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని సూచన

బహిరంగ చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిద్ధమా? అంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి - మిగతా 2 లో

ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- ఇద్దరు పిల్లల నిబంధనపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- సంతానోత్పత్తి రేటు 2.1 కంటే దిగువకు తగ్గినట్లు గుర్తుచేసిన కోర్టు
- వృద్ధుల జనాభా పెరుగుదలపై కోర్టు ఆందోళన
- మూడో సంతానంతో అనర్హతకు గురైన మాజీ సర్పంచ్‌కు ఊరట



ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఇద్దరు పిల్లలకుమించిఉండకూడదనే నిబంధన ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతవరకు - మిగతా 2 లో

అగ్నివీరులకు మరో రెండేళ్లు సర్వీసు పొడిగింపు కేంద్రం కీలక నిర్ణయం

- నాలుగేళ్ల తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం మందికి వెసులుబాటు
- పొడిగింపు తర్వాతా శాశ్వత సర్వీసుకు అవకాశం
- ప్రతిభ ఆధారంగా శాశ్వత నియామకాలు
- రాత పరీక్ష తర్వాతే శారీరక పరీక్ష.. నైపుణ్య ధ్రువపత్రాలు
- తొలి బ్యాచ్ సర్వీసు గడువు డిసెంబరులో ముగింపు



అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో చేరిన అగ్నివీరులకు కేంద్ర ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. ఇప్పటికే ఉన్న నాలుగేళ్ల సర్వీసుకు అదనంగా మరో రెండేళ్లు పొడిగించాలని - మిగతా 2 లో

కరవు కష్టాల నుంచి రైతన్నను గట్టెక్కించండి

- కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- కరవు పరిస్థితులపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం
- రాష్ట్రానికి ప్రత్యేక సాయం అందించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి
- వీబీ జీ రామ్ జీ పథకం పనిదినాలు 200కి పెంచాలని కోరిన సీఎం
- కరవు బాధితులకు డ్రాట్ కార్డులు, జేజేఎం విస్తరణకు సహకరించాలని వినతి
- పంటల బీమా పరిహారం త్వరగా చెల్లించేలా చూడాలని సూచన



ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ రంగం కుదేలైన నేపథ్యంలో, రైతులను, ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

సీఎం చంద్రబాబుకు ప్రధాని మోదీ ఫోన్ తుపాన్ల నష్టంపై ఆరా

- వరుస తుపాన్ల నేపథ్యంలో సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసిన ప్రధాని మోదీ
- రాష్ట్రానికి జరిగిన నష్టం, రైతుల ఇబ్బందులను ప్రధానికి వివరించిన ముఖ్యమంత్రి
- 'మురసు' తుపాన్ వల్ల రూ.343.95 కోట్ల ప్రాథమిక నష్టం వాటిల్లిందని వెల్లడి
- మొత్తం నష్టంలో 94 శాతం వ్యవసాయ రంగంలోనే జరిగిందని కేంద్రానికి నివేదన
- రాష్ట్ర ప్రభుత్వ సహాయక చర్యలను ప్రశంసించిన ప్రధాని - మిగతా 2 లో

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు

మొదటిపేజీ తరువాయి - కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే బండి సంజయ్ బాడీగార్డ్‌లా వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. తనకంటే చిన్నవాడైన అమిత్ షాకు రాంచందర్‌రావు కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు. అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా విద్యాసంస్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళుతూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్టుగా.. భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో అలా ఉందని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి

మొదటిపేజీ తరువాయి - అవలంబిస్తోందని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని, ఈ విషయం ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాలతో మరోసారి బహిర్గతమైందని ఆమె విమర్శించారు. ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో రాష్ట్ర అధికారులు గోదావరి - కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ నుంచి చేపట్టాలని కోరుతుంటే... మరోవైపు కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కవిత ఆరోపించారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని, 2024లోనే తెలంగాణ జాగృతి తరఫున తాము దీనిని వ్యతిరేకించామని గుర్తుచేశారు. "రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు 'గురుదక్షిణ'గా చెల్లించుకుంటున్నారు" అని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని కవిత హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం జరిపే అన్ని సంప్రదింపుల నుంచి తెలంగాణ తక్షణమే వైదొలగాలని, ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వెంటనే లేఖ రాయాలని ఆమె డిమాండ్ చేశారు.

ఉదయం 11 గంటలకే ఆయన

నోటి నుంచి మద్యం వాసన వచ్చేది

మొదటిపేజీ తరువాయి - పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో వ్యక్తిగత విమర్శలు చేశారు. ఆయనకు మద్యపానం సేవించే అలవాటు ఉందని, అలాంటి వ్యక్తి రాష్ట్రంలో మాదకద్రవ్యాల సమస్యను ఎలా పరిష్కరించగలరని ప్రశ్నించారు. సంగ్రూర్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'ఇన్సాఫ్ ర్యాలీ'లో పాల్గొన్న రాహుల్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో తాను, భగవంత్ మాన్ లోక్‌సభ సభ్యులుగా ఉన్నప్పటి సంఘటనను రాహుల్ గుర్తు చేసుకున్నారు. "ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి మద్యం వాసన వచ్చేది" అని సంచలన ఆరోపణ చేశారు. మద్యం సేవించడం ఆయన వ్యక్తిగత విషయం కావొచ్చని, కానీ ప్రతిరోజూ మత్తులో ఉండే ముఖ్యమంత్రి మాదకద్రవ్యాల వల్ల కలిగే బాధను ఎలా అర్థం చేసుకోగలరని నిలదీశారు. పంజాబ్‌కు డ్రగ్స్ సమస్యపై నిజంగా బాధపడే నాయకుడు అవసరమని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం పంజాబ్‌ను పాలించడం లేదని, రాష్ట్రాన్ని ఢిల్లీ నుంచి నడిపిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. "పంజాబ్ పాలనను సగం అరవింద్ కేజ్రీవాల్, మరో సగం కేంద్ర హోంమంత్రి అమిత్ షా నడుపుతున్నారు. భగవంత్ మాన్ కేవలం అక్కడ కూర్చుంటున్నారు అంతే" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పంజాబ్ నుంచే పాలన అందిస్తామని స్పష్టం చేశారు. మూడేళ్లలో డ్రగ్స్‌ను అంతం చేస్తానన్న అమిత్ షా వ్యాఖ్యలను కొట్టిపారేసిన రాహుల్, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అంతకాలం కొనసాగకపోవచ్చని అన్నారు. గతంలో పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య పెరిగిపోతోందని తాను హెచ్చరించినప్పుడు బీజేపీ, అకాలీదళ్ తన మాటలను పట్టించుకోలేదని రాహుల్ గుర్తుచేశారు. రాష్ట్రంలో డ్రగ్స్, గ్యాంగ్‌స్టర్ సంస్కృతిని నిర్మూలించాలంటే పరిశ్రమలు, ఫ్యాక్టరీలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్ గాంధీ మరోసారి సవాల్ విసిరారు. మోదీతో ముఖాముఖి చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, కేవలం ఐదు నిమిషాల్లోనే మోదీ ఒక "దేశద్రోహి" అని, ఆయన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతిలో కీలుబొమ్మ అని నిరూపించగలనని అన్నారు.

ప్రజల కడుపు మాడుతున్నా.. సైనిక ఖర్చులకే పాకిస్థాన్ పెద్దపీట!

మొదటిపేజీ తరువాయి - 'యూరోపియన్ టైమ్స్ న్యూస్' పోర్టల్ తన కథనంలో వెల్లడించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ పాకిస్థాన్ ప్రభుత్వం రక్షణ శాఖకు ఏకంగా 3 ట్రిలియన్ల పాకిస్థానీ రూపాయలను కేటాయించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 17.6 శాతం ఎక్కువ. ముఖ్యంగా ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రి కొనుగోలుకు కేటాయించే నిధిని 39.6 శాతం పెంచి 925.8 బిలియన్ రూపాయలకు చేర్చింది. మరోవైపు దేశ ప్రజలందరి ఆరోగ్యానికి కేటాయించింది కేవలం 53.3 బిలియన్ రూపాయలు మాత్రమే. ఇందులో ఆరోగ్యం, పోషకాహారం అభివృద్ధికి కేటాయించింది కేవలం 24.3 బిలియన్లు. విచిత్రం ఏంటంటే, సైనిక సిబ్బంది పెన్షన్ల కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా 822 బిలియన్ రూపాయలు కేటాయించారు. ఇది మొత్తం ఆరోగ్య బడ్జెట్ కంటే 15 రెట్లు అధికం. "ప్రజల ఆరోగ్యంపై ఒక రూపాయి ఖర్చు చేస్తే, సైన్యంపై 56 రూపాయలు ఖర్చుచేస్తూ పాక్ ప్రభుత్వం దేనికి విలువిస్తుందో స్పష్టం చేసింది" అని ఆ కథనం పేర్కొంది. ప్రభుత్వ ప్రాధాన్యతల ఫలితంగా పాకిస్థాన్‌లో ఆకలి స్థాయిలు తీవ్రంగా పెరిగాయి. 2026 ప్రపంచ ఆకలి సూచీలో 122 దేశాల్లో పాకిస్థాన్ 106వ స్థానంలో నిలిచింది. దాని స్కోరు 25.5గా నమోదైంది. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ (19.2), నేపాల్ (14.5), భారత్ (24.1) కంటే కూడా పాక్ పరిస్థితి దారుణంగా ఉంది. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంక కూడా పుంజుకుని 10.2 స్కోరుతో దక్షిణాసియాలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. దేశంలో పోషకాహార లోపం 16.1 శాతానికి, ఐదేళ్లలోపు పిల్లల్లో ఎదుగుదల లోపం 33.6 శాతానికి, బరువు తక్కువగా ఉండటం (చైల్డ్ వేస్టింగ్) 9.8 శాతానికి చేరింది. ఐదేళ్లలోపు పిల్లల మరణాల రేటు 5.6 శాతంగా ఉంది. ఇది ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిని సూచిస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీనికి తోడు గోధుమ మద్దతు ధర విధానాన్ని రద్దు చేయడంతో సేకరణ దారుణంగా పడిపోయింది. దీంతో 1 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేసి సుమారు 3.5 మిలియన్ టన్నుల గోధుమలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం కూడా అదే స్థాయిలో ఆహార కొరత ఉండటంతో, రాబోయే రోజుల్లో పిండి ధర సామాన్యులకు అందనంతగా పెరిగిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అగ్నివీరులకు మరో రెండేళ్లు సర్వీసు పొడిగింపు.. కేంద్రం కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి - నిర్ణయించింది. తొలి బ్యాచ్ అగ్నివీరుల పదవీకాలం ముగియనున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిర్ణయం ప్రకారం, నాలుగేళ్ల సేవ తర్వాత సాధారణ విధానంలో శాశ్వత సైనికులుగా ఎంపిక కాని మిగిలిన 75 శాతం అగ్నివీరులకు మరో రెండేళ్లు పనిచేసే అవకాశం లభించనుంది. ఈ పొడిగించిన సేవ పూర్తయ్యాక కూడా ప్రతిభ ఆధారంగా సాధారణ సైనిక విభాగంలో చేరేందుకు అవకాశం కల్పిస్తామని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి వెల్లడించారు. అగ్నిపథ్ పథకం 2022లో ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ పథకం కింద సైన్యం, నౌకాదళం, వాయుసేనల్లో నాలుగేళ్ల కాలానికి నియామకాలు చేపడుతున్నారు. ఈ గడువు ముగిసిన తర్వాత ప్రతి బ్యాచ్‌లో గరిష్ఠంగా 25 శాతం మందిని ప్రతిభ, సైనిక దళాల అవసరాల ఆధారంగా సాధారణ సర్వీసులో కొనసాగించే అవకాశం ఉంది. మిగిలినవారు విధుల నుంచి వైదొలగాల్సి వచ్చేది. తాజా నిర్ణయంతో వారికి అదనపు సేవా అవకాశం లభించనుంది. నియామక ప్రక్రియలోనూ మార్పులు ప్రకటించారు. ఇకపై శారీరక పరీక్షకు ముందుగా రాత పరీక్ష నిర్వహించనున్నారు. సైన్యంలో పనిచేసిన సమయంలో అగ్నివీరులు పొందిన శిక్షణ, నైపుణ్యాలను గుర్తిస్తూ ధ్రువపత్రాలు కూడా అందించనున్నారు. తొలి బ్యాచ్‌లో సుమారు 18 వేల మంది అగ్నివీరుల నాలుగేళ్ల సర్వీసు గడువు 2026 డిసెంబరులో ముగియనుండటంతో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

సీఎం చంద్రబాబుకు ప్రధాని మోదీ ఫోన్.. తుపాన్ల నష్టంపై ఆరా



మొదటిపేజీ తరువాయి - వరుస తుపాన్లతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలుస్తామని కేంద్రం భరోసా ఇచ్చింది. వారం రోజుల వ్యవధిలో 'అర్నబ్', 'మురసు' తుపాన్లు రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేడు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫోన్ చేసి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తుపాన్ల ప్రభావం, వాటి వల్ల జరిగిన నష్టం గురించి చంద్రబాబు ప్రధానికి వివరించారు. భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల రంగాల్లోనూ భారీ నష్టం వాటిల్లిందని, రాష్ట్రాన్ని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తగిన సహాయం అందించాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రధాని మోదీ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను ప్రశంసించారు. నిరంతర అప్రమత్తతతో తుపాను సవాళ్లను సమర్థంగా ఎదుర్కొన్నారని చంద్రబాబును అభినందించారు. అంతకుముందు ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాయడంతో పాటు ఫోన్‌లోనూ మాట్లాడారు. మంగళవారం ఒక్కరోజే రెండుసార్లు అమిత్ షాతో మాట్లాడిన చంద్రబాబు, ఒక తుపాను నుంచి కోలుకోకముందే మరో తుపాను రావడం వల్ల పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారిందని వివరించారు. 'మురసు' తుపాను వల్ల రాష్ట్రంలో ప్రాథమికంగా రూ.343.95 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని తెలిపారు. ఇందులో సుమారు 94 శాతం నష్టం ఒక్క వ్యవసాయ రంగంలోనే జరిగిందని పేర్కొన్నారు. ఏడు జిల్లాల్లోని 465 గ్రామాల్లో 50,473 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 69,828 మంది రైతులు నష్టపోయారని సీఎం వివరించారు. దెబ్బతిన్న పంటల్లో 45,900 హెక్టార్ల వరి పంట ఉందని, ఒక్క వ్యవసాయ రంగంలోనే ప్రాథమిక నష్టం రూ.324.22 కోట్లుగా ఉందని తెలిపారు. ముఖ్యంగా బాపట్ల, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఉద్యాన పంటలతో సహా పంట నష్టం తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. తుపాన్ల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ), రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్)లను అప్రమత్తం చేశామని చంద్రబాబు తెలిపారు. సహాయక చర్యల కోసం 11 ఎస్‌డీఆర్ఎఫ్, 13 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని, ప్రభావిత జిల్లాల్లో 480 పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా మార్చి, 12,230 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని కేంద్రానికి వివరించారు.

"డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా".. ఎన్నికల ఫలితాలతో స్వరం మార్చిన ట్రంప్



మొదటిపేజీ తరువాయి - ప్రవేశపెట్టే ప్రతీ బిల్లును వీటో చేస్తానని గర్జించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఘోర పరాజయం తర్వాత అనూహ్యంగా స్వరం మార్చారు. దేశ శ్రేయస్సు కోసం డెమొక్రాట్లతో కలిసి పనిచేయడానికి సిద్ధమని ప్రకటించారు. "ఈ ఎన్నికల్లో నేను బ్యాలెట్‌పై లేను, ఒకవేళ ఉండుంటే మేము భారీ మెజారిటీతో గెలిచేవాళ్లం" అని వ్యాఖ్యానించారు ఈ ఎన్నికల్లో డెమొక్రాట్లు అంచనాలకు మించి ప్రతినిధుల సభ (హౌస్), సెనెట్ రెండింటినీ కైవసం చేసుకోవడంతో ట్రంప్ ఈ మేరకు దిగిరాక తప్పలేదు. ఎన్బీసీ న్యూస్ అంచనాల ప్రకారం, 435 స్థానాలున్న ప్రతినిధుల సభలో డెమొక్రాట్లు 256 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. అదేవిధంగా, 100 మంది సభ్యులున్న సెనెట్‌లో కనీసం 54 స్థానాలు దక్కించుకుని స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించారు. ధరలు తగ్గిస్తానని, ప్రజల జీవితాలను సులభతరం చేస్తానని 2024 ఎన్నికల్లో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన ట్రంప్, ఆ తర్వాత ఆ హామీలను పక్కనపెట్టారు. అమెరికాను గొప్పగా మార్చేందుకు టారిఫ్‌లు విధించడం, ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు కోసం యుద్ధానికి దిగడం, వైట్‌హౌస్ సుందరీకరణ వంటి భారీ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ఇవే ఆయన పట్ల ప్రజాగ్రహానికి కారణమయ్యాయి. రిపబ్లికన్లకు కంచుకోటలైన టెక్సాస్, కాన్సాస్, దక్షిణ కరోలినా వంటి రాష్ట్రాల్లో పార్టీ ఓటమి పాలుకావడం ఆయన అంచనాలను తీవ్రంగా దెబ్బతీసింది. కాన్సాస్‌లో 95 ఏళ్ల రిపబ్లికన్ల గుత్తాధిపత్యానికి తెరదించుతూ డెమొక్రాట్ అభ్యర్థి ఆడమ్ హామిల్టన్ సెనేటర్‌గా గెలిచారు. టెక్సాస్ గవర్నర్‌గా హినా హినోజోసా ఎన్నికవడంతో 36 ఏళ్ల రిపబ్లికన్ పాలనకు ముగింపు పడింది. ట్రంప్ స్వయంగా ఎంపిక చేసిన అభ్యర్థులు సైతం ఓడిపోవడం ఆయనకు వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బ. ఈ ఓటమితో పార్టీపై ట్రంప్ పట్టు సడలుతుందని, ఆయనను వ్యతిరేకించే వారి సంఖ్య పెరుగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధ్యక్షుడిగా మిగిలిన రెండేళ్లలో ఆయన దూకుడుకు కళ్లెం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఫలితాల తర్వాత 'పొలిటికో'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "రెండేళ్ల పాటు ప్రతీదాన్నీ వీటో చేస్తూ కూర్చోవాలని నేను అనుకోవడం లేదు. దేశానికి మంచి జరిగేలా చూసేందుకు డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తాం" అని తెలిపారు. అయితే, డెమొక్రాట్లు మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. ప్రతినిధుల సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్న హకీమ్ జెఫ్రీస్ మాట్లాడుతూ, "మేము కీలకమైన మార్పులు తీసుకురావాల్సి ఉంది. ఇప్పుడున్న వ్యవస్థలు సరిగా లేవు. అమెరికా ప్రజలకే ప్రాధాన్యత ఇచ్చే కాంగ్రెస్ కావాలి" అని స్పష్టం చేశారు. దీంతో రాబోయే రెండేళ్లలో ట్రంప్ పాలన ఎలా సాగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

కరవు కష్టాల నుంచి రైతన్నను గట్టెక్కించండి



మొదటిపేజీ తరువాయి - రాష్ట్రంలో కరవు తీవ్రతను అంచనా వేసేందుకు పర్యటించిన కేంద్ర అంతర మంత్రిత్వ శాఖల బృందం (ఐఎంసీటీ) బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం చేపడుతున్న ఉపశమన చర్యలను సీఎం వారికి సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను కేంద్ర బృందానికి వివరిస్తూ, "ఒకవైపు తీరప్రాంతం తుఫాన్లతో నష్టపోతుంటే, మరోవైపు రాయలసీమ, ఇతర ప్రాంతాలు ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరవు కోరల్లో చిక్కుకున్నాయి" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది సాధారణం కంటే అత్యంత తక్కువ వర్షపాతం నమోదు కావడం వల్ల ఖరీఫ్ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని, సాగునీటితో పాటు తాగునీరు, పశుగ్రాసానికి కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన ప్రాంతంగా అనంతపురం జిల్లా నిలిచిన విషయాన్ని ఆయన బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 412 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించామని, పంట నష్టాలపై పూర్తిస్థాయి అంచనాలతో వారం రోజుల్లో కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

వ్యవసాయానికి అండగా కీలక పథకాల విస్తరణ

కరవు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ఉపాధిని, వ్యవసాయాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కొన్ని కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి క్షేత్రస్థాయిలో మానవ వనరుల అవసరం ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో 'వీబీ జీ రామ్ జీ' పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచాలని కోరారు. ఈ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానించడం ద్వారా రైతులకు కూలీల కొరత తీరడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సూచించారు. కరవు కారణంగా రైతుల ఆదాయం పూర్తిగా పడిపోయిందని, గతంలో తీవ్ర కరవు వచ్చినప్పుడు రాయలసీమలో పది ఎకరాల రైతులకు కూడా రేషన్ కార్డులు ఇచ్చి ఆదుకున్నామని గుర్తుచేశారు. అదే తరహాలో ప్రస్తుతం అర్హులైన కరవు బాధిత కుటుంబాలకు 'డ్రాట్ కార్డులు' జారీ చేసే అంశాన్ని పరిశీలించి, కేంద్ర సహకారంతో నిత్యావసరాలను సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు, రైతుల వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు కేంద్రం తోడ్పాటునందించాలని కోరారు.

జల్ జీవన్ మిషన్‌తో శాశ్వత పరిష్కారం

వర్షాభావంతో భూగర్భ జలమట్టాలు ప్రమాదకరంగా పడిపోయాయని, కొత్తగా ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడటం లేదని ముఖ్యమంత్రి తెలిపారు. కేవలం తాత్కాలిక నీటి సరఫరా చర్యలతో సరిపెట్టకుండా, శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఇందుకోసం 'జల్ జీవన్ మిషన్' (జేజేఎం) పథకాన్ని మరింత విస్తరించి, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, అనుసంధానం వంటి పనులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా పరిహారాన్ని త్వరగా అందించడం అత్యవసరమని అన్నారు. బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా, వీలైనంత త్వరగా పరిహారం రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది రైతులకు తదుపరి పంటకు పెట్టుబడిగా ఉపయోగపడుతుందని వివరించారు. ఈనెల 2, 3 తేదీల్లో కేంద్ర బృందం రెండు టీమ్‌లుగా విడిపోయి కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక, తమ క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా 15 రోజుల్లో కేంద్రానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని ఐఎంసీటీ సభ్యులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందించే సహాయంపై నిర్ణయం తీసుకోనుంది.

హైదరాబాద్ అభివృద్ధికి యాదవుల సహకారం కావాలి!



మొదటిపేజీ తరువాయి - **సదర్ ఉత్సవానికి రాష్ట్ర పండుగ హోదా**

గత ప్రభుత్వ హయాంలో సదర్ సమ్మేళనాన్ని అధికారికంగా నిర్వహించలేదని సీఎం గుర్తుచేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యాదవుల విజ్ఞప్తి మేరకు సదర్ సమ్మేళనానికి రాష్ట్ర పండుగ హోదా కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఉత్సవాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు విడుదల చేసిందని వెల్లడించారు.

కులగణనతో సామాజిక న్యాయం

దేశంలోనే తొలిసారిగా కులగణన చేపట్టి దేశానికి మార్గదర్శకంగా నిలిచామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఏ సామాజిక వర్గం జనాభా ఎంత ఉంటే, ఆ మేరకు అవకాశాలు, వాటా కల్పించాలనే లక్ష్యంతో కులగణన చేపట్టినట్లు వివరించారు. యాదవులకు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించామని చెప్పారు. ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలకమండలి సభ్యురాలిగా నియమించడంతో పాటు గోశాల బాధ్యతలు కూడా అప్పగించినట్లు తెలిపారు.

తేజస్వీ యాదవ్ ప్రత్యేక ఆకర్షణ

బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యాదవ ప్రతినిధులు సదర్ ఉత్సవంలో పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి, ధర్మేంద్ర యాదవ్, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తదితర ప్రజాప్రతినిధులు, వివిధ రాష్ట్రాల యాదవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో కాదు.. దమ్ముంటే సభలో చర్చకు రండి



నిర్మలా సీతారామన్ స్పందించారు. చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని, సోషల్ మీడియా కాదని తేల్చిచెప్పారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె వరుస పోస్టులు చేశారు. "రాహుల్ జీ, చర్చకు వేదికను ఎంచుకోమని మీరు ప్రధానిని కోరుతున్నారు. దానికి ఇప్పటికే ఒక వేదిక ఉంది, అదే పార్లమెంట్. దానికి మీరే ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు" అని నిర్మల పేర్కొన్నారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఈవీఎంల పనితీరుపై చర్చించేందుకు పార్లమెంటులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేద్దామని హోంమంత్రి అమిత్ షా సోమవారమే ప్రతిపాదించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. "సోషల్ మీడియాలో సవాళ్లు విసిరినంత ఉత్సాహం పార్లమెంటులో చర్చకు ఎందుకు చూపించడం లేదు?" అని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు సభ నుంచి వాకౌట్ చేస్తున్నారని నిర్మలా సీతారామన్ ఆరోపించారు. "సమాధానాలు డిమాండ్ చేసేటప్పుడు, వాటిని వినే బాధ్యత కూడా ఉంటుంది. ఎన్నోసార్లు మీరు, మీ పార్టీ సభ్యులు ప్రభుత్వం స్పందిస్తున్న సమయంలోనే సభ నుంచి వాకౌట్ చేశారు. అలాంటప్పుడు చర్చకు అంత ఆసక్తిగా ఉన్నామని ఎలా చెప్పుకుంటారు?" అని ఆమె నిలదీశారు. ప్రతిపక్షాల ఆందోళనలతో పార్లమెంట్ సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతున్నాయని ఆమె విమర్శించారు. "మీకు చర్చపై నిజంగా అంత ఆసక్తి ఉంటే, ముందు పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగేలా సహకరించవచ్చు కదా?" అని ప్రశ్నించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నివాసంలో నిర్వహించిన "మాక్ పార్లమెంట్" కార్యక్రమాన్ని కూడా ఆమె తప్పుబట్టారు. అది "మాక్ పార్లమెంట్" కన్నా "పార్లమెంటును అపహాస్యం చేయడం"లా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి మాట్లాడేవారు ముందుగా ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని హితవు పలికారు. "'డరో మత్' (భయపడొద్దు) అని మీరు అంటుంటారు కదా. అలాంటప్పుడు వాస్తవాలతో, ఆధారాలతో సభకు రండి, విమర్శలను ఎదుర్కోండి, సమాధానాలు వినడానికి కూర్చోండి" అని రాహుల్ గాంధీకి నిర్మలా సీతారామన్ సవాల్ విసిరారు.ం

ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



మొదటిపేజీ తరువాయి - సమంజసమని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దేశంలో సంతానోత్పత్తి రేటు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ఇద్దరికి మించి పిల్లలున్నవారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించే చట్టాలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. గత రెండు దశాబ్దాల్లో దేశ జనాభా పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని బుధవారం విచారణ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం భారతదేశ మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 2.1 అనే ప్రత్యామ్నాయ స్థాయి కంటే దిగువకు పడిపోయిందని గుర్తుచేసింది. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే దశాబ్దాల్లో వృద్ధుల జనాభా పెరిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఇద్దరికి మించి పిల్లలున్నవారు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించడం ఇప్పటికీ అవసరమా? అని ప్రశ్నించింది. మహారాష్ట్రలోని కాకోడా గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మంగళ భీమ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. మూడో సంతానం జన్మించడంతో ఆమెను ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హురాలిగా ప్రకటించారు. ఆమె అప్పీల్‌ను అనుమతించిన సుప్రీంకోర్టు, అనర్హత నిర్ణయాన్ని రద్దు చేసింది. ఇదే అంశంపై 2003లో వెలువడిన జావేద్ వర్సెస్ హర్యానా రాష్ట్రం తీర్పును కూడా సుప్రీంకోర్టు పునఃపరిశీలనకు స్వీకరించింది. ఆ తీర్పును విస్తృత ధర్మాసనానికి నివేదించింది. హర్యానా పంచాయతీరాజ్ చట్టం-1994 ప్రకారం ఇద్దరికి మించి పిల్లలున్నవారు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులని అప్పట్లో ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం సమర్థించింది. 2003లో ఆ తీర్పు వెలువడినప్పుడు దేశంలో ఒక్కో మహిళకు సగటున ముగ్గురు పిల్లలు ఉండేవారని, జనాభా నియంత్రణ ప్రధాన విధానపరమైన అంశంగా ఉండేదని ప్రస్తుత ధర్మాసనం గుర్తుచేసింది. ఇప్పుడు పరిస్థితులు మారినందున ఈ నిబంధనలు రాజ్యాంగబద్ధంగా కొనసాగాలా? లేదా? అన్నది విస్తృత ధర్మాసనం తేల్చనుంది. అయితే, ఇద్దరు పిల్లల నిబంధనను దేశవ్యాప్తంగా రద్దు చేసినట్లు సుప్రీంకోర్టు ప్రకటించలేదు.

అడ్డగోలుగా అక్రమ సెల్లారు నిర్మాణం

నిజాంపేట సర్కిల్ సింహపురి కాలనీలో అక్రమంగా సెల్లారు నిర్మాణం

టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణం

పక్కా ప్లానింగ్ తో సెల్లారు పూడ్చి పనులు కొనసాగిస్తున్న నిర్మాణ దారుడు

అధికారుల చర్యలు రోడ్లపై వ్యాపారం చేసుకునే చిరువ్యాపారులపైనే నా?



నిజాంపేట,నవంబర్03(విజన్ పక్షం ప్రతినిధి): ఒకవైపు పట్టణ ప్రణాళిక అధికారులు అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమంటూ ప్రగల్భాలు పలుకుతూనే మరోవైపు అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాస్తున్నారా అనిపిస్తుంది సీఎంసీ పరిధిలోని నిజాంపేట సర్కిల్ కార్యాలయ టౌన్ ప్లానింగ్ అధికార యంత్రాంగాన్ని చూస్తుంటే.ఎప్పటికప్పుడు రోడ్డుకు పక్కన చిరు వ్యాపారస్తులపై విరుచుకుపడుతూ వారి చిన్నాచితకా వ్యాపార డబ్బాలను కూల్చివేసే అధికారులు,ఇష్టానుసారంగా సెల్లారులు నిర్మిస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోడానికి వెనుకడుతున్నారో అని పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్కిల్ పరిధిలోని కేజిఆర్ కన్వెన్షన్ ఎదురుగా సింహపురి కాలనీలో అక్రమంగా సెల్లారు తవ్వి బేస్మెంట్లు పూర్తవ్వగానే దాన్ని పూడ్చిపెట్టి యధాతదంగా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు.దీనిపై అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి సదరు నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.అసలు పట్టణ ప్రణాళిక అధికార యంత్రాంగం సదరు అక్రమ సెల్లారు నిర్మాణంపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే అధికారులే అక్రమ నిర్మాణాలకు లైన్ క్లియర్ చేస్తున్నారా అని స్థానిక వాసులు అభిప్రాయపడున్నారు.ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకుని అక్రమ సెల్లారు నిర్మాణాలను అరికట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

కొంగర రావిరాల కొంగర ఖుర్దు ముదిరాజ్ మత్స్యకార సొసైటీ అధ్యక్షులుగా

లింగం నర్సింహ్మ ముదిరాజ్ ఎన్నిక

ఎన్నో సంవత్సరాల పోరాట ఫలితంగా

కొంగర రావిరాల కొంగర ఖుర్దు ముదిరాజ్ మత్స్యకార సొసైటీ అధికారికంగా రిజిస్ట్రేషన్

సంతోషం వ్యక్తం చేసిన ముదిరాజ్ మత్స్యకార సొసైటీ సభ్యులు

మహేశ్వరం, నవంబర్ 04, (విజన్ పక్షం): ఎన్నో సంవత్సరాల పోరాట ఫలితంగా కొంగర రావిరాల కొంగర ఖుర్దు ముదిరాజ్ మత్స్యకార సొసైటీ అధికారికంగా రిజిస్ట్రేషన్ అయింది. రంగారెడ్డి జిల్లా మత్స్యకార సొసైటీ ఏ డి వెంకటయ్య, రంగారెడ్డి జిల్లా మత్స్యకార సొసైటీ చైర్మన్ దూస వెంకటేష్ శేరిగూడ, రంగారెడ్డి జిల్లా మత్స్యకార సొసైటీ డైరెక్టర్ కుక్కల కృష్ణ తుక్కుగూడ, వారు సహకరించినందుకు వారికి సొసైటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.దీంతో ముదిరాజ్ మత్స్యకార సొసైటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కొంగర ఖుర్దు రెవెన్యూ పరిధిలో ఉన్న కొత్తకుంట, కోమటి కుంట, మైసమ్మ కుంట ఈ మూడు కుంటలపై చేపలు పెంచి పట్టుకోవడానికి కొంగర ఖుర్దు ముదిరాజులకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మత్స్యకార సొసైటీ రిజిస్ట్రేషన్ జరిగింది. లింగం నరసింహ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ మత్స్యకార సొసైటీ కోసం ముదిరాజులు గత నాలుగైదు సంవత్సరాలుగా ఆఫీసుల చుట్టూ తిరిగి చివరకు ఈరోజు విజయం సాధించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ పెద్దలు లింగం నర్సింహ్మ ముదిరాజ్, సొప్పరి యాదయ్య ముదిరాజ్, లింగం సురేష్ ముదిరాజ్, మీగడ రాజ్ కుమార్ ముదిరాజ్ లు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం సొసైటీ అధ్యక్షుడిగా లింగం నర్సింహ్మ ముదిరాజ్ గారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో లింగం తిరుమలేష్ ముదిరాజ్, శేరిగూడ వాసులు వెంకటేష్ ముదిరాజ్, తుక్కుగూడ కుక్కల క్రిష్ణ ముదిరాజ్, సప్పిడి శ్రీరాములు ముదిరాజ్, మీగడ శేఖర్ ముదిరాజ్, పొలమోని శ్రీనివాస్ ముదిరాజ్, రాగనమోని ప్రభాకర్ ముదిరాజ్, తాళ్ళ రమేష్ ముదిరాజ్, సొప్పరి బాబులు ముదిరాజ్, పొలమోని ఆంజనేయులు ముదిరాజ్, పొలమోని శ్రీకాంత్ ముదిరాజ్, రాగనమోని పాండు ముదిరాజ్, సప్పిడి నాగేష్ ముదిరాజ్, కాగు నర్సింహ్మ ముదిరాజ్, రాగనమోని శేఖర్ ముదిరాజ్ మరియు తదితరులు పాల్గొన్నారు.



కొంగర రావిరాల కొంగర ఖుర్దు ముదిరాజ్ మత్స్యకార సొసైటీ అధ్యక్షులుగా

లింగం నర్సింహ్మ ముదిరాజ్ ఎన్నిక

ఎన్నో సంవత్సరాల పోరాట ఫలితంగా

కొంగర రావిరాల కొంగర ఖుర్దు ముదిరాజ్ మత్స్యకార సొసైటీ అధికారికంగా రిజిస్ట్రేషన్

సంతోషం వ్యక్తం చేసిన ముదిరాజ్ మత్స్యకార సొసైటీ సభ్యులు



మహేశ్వరం, నవంబర్ 04, (విజన్ పక్షం): ఎన్నో సంవత్సరాల పోరాట ఫలితంగా కొంగర రావిరాల కొంగర ఖుర్దు ముదిరాజ్ మత్స్యకార సొసైటీ అధికారికంగా రిజిస్ట్రేషన్ అయింది. దీంతో ముదిరాజ్ మత్స్యకార సొసైటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కొంగర ఖుర్దు రెవెన్యూ పరిధిలో ఉన్న కొత్తకుంట, కోమటి కుంట, మైసమ్మ కుంట ఈ మూడు కుంటలపై చేపలు పెంచి పట్టుకోవడానికి కొంగర ఖుర్దు ముదిరాజులకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మత్స్యకార సొసైటీ రిజిస్ట్రేషన్ జరిగింది. లింగం నరసింహ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ మత్స్యకార సొసైటీ కోసం ముదిరాజులు గత నాలుగైదు సంవత్సరాలుగా ఆఫీసుల చుట్టూ తిరిగి చివరకు ఈరోజు విజయం సాధించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ పెద్దలు లింగం నర్సింహ్మ ముదిరాజ్, సొప్పరి యాదయ్య ముదిరాజ్, లింగం సురేష్ ముదిరాజ్, మీగడ రాజ్ కుమార్ ముదిరాజ్ లు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం సొసైటీ అధ్యక్షుడిగా లింగం నర్సింహ్మ ముదిరాజ్ గారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో లింగం తిరుమలేష్ ముదిరాజ్, శేరిగూడ వాసులు వెంకటేష్ ముదిరాజ్, తుక్కుగూడ కుక్కల క్రిష్ణ ముదిరాజ్, సప్పిడి శ్రీరాములు ముదిరాజ్, మీగడ శేఖర్ ముదిరాజ్, పొలమోని శ్రీనివాస్ ముదిరాజ్, రాగనమోని ప్రభాకర్ ముదిరాజ్, తాళ్ళ రమేష్ ముదిరాజ్, సొప్పరి బాబులు ముదిరాజ్, పొలమోని ఆంజనేయులు ముదిరాజ్, పొలమోని శ్రీకాంత్ ముదిరాజ్, రాగనమోని పాండు ముదిరాజ్, సప్పిడి నాగేష్ ముదిరాజ్, కాగు నర్సింహ్మ ముదిరాజ్, రాగనమోని శేఖర్ ముదిరాజ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

ఈర్లపల్లిలో సత్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటి శుద్ధి కేంద్రం ప్రారంభం

ప్రారంభించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఫౌండేషన్ ఛైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి



చేవెళ్ళ, నవంబర్ 4, విజన్ పక్షం: గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సత్యం ఫౌండేషన్ ఛైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి తెలిపారు. చేవెళ్ల మండలం ఈర్లపల్లి గ్రామంలో సత్యం ఫౌండేషన్ సహకారంతో రూ. 2 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, గ్రామ సర్పంచ్ పట్నం లావణ్య రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజారోగ్యానికి ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందన్నారు. సేవాభావంతో ముందుకొచ్చి గ్రామస్థులకు తాగునీటి సదుపాయం కల్పించిన సత్యం ఫౌండేషన్ నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఫౌండేషన్ ఛైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో స్వచ్ఛమైన తాగునీరు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కలుషిత నీటిని తాగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అందుకే గ్రామస్థులకు శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ తరపున ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామ ప్రజలందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాణిక్య మంజులత, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటరు నమోదుకు ఎమ్మెల్యే రేవూరి ప్రత్యేక చొరవ..

క్యాంపు కార్యాలయంలో రెండు ప్రత్యేక డెస్కుల ఏర్పాటు

పరకాల, నవంబర్ 4: వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పరకాల క్లస్టర్ ఇన్‌చార్జిలు పిలుపునిచ్చారు. పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టభద్రుల ఓటరు నమోదు కోసం ప్రత్యేకంగా రెండు డెస్కులను ఏర్పాటు చేశారు. ఓటరు నమోదు గడువు సమీపిస్తున్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా నిర్దిష్ట గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హత కలిగిన పట్టభద్రులెవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల క్లస్టర్ ఇన్‌చార్జిలు అల్లం శ్రీరామ్, దొమ్మటి కృష్ణకాంత్ (నాని), ఇనుముల రాము, కాంగ్రెస్ పార్టీ పరకాల ఎస్సీ సెల్ అధ్యక్షుడు, రెండో వార్డు 56వ బూత్ బీఎల్ఏ బొమ్మకంటి చంద్రమౌళి, రెండో వార్డు అధ్యక్షుడు బొచ్చు రాజు తదితరులు పాల్గొన్నారు.

ముంబై కరాటే టోర్నమెంట్‌లో

సత్తా చాటిన చేవెళ్ల క్రీడాకారులు

ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో 8 పతకాల పంట



చేవెళ్ల, నవంబర్ 4, విజన్ పక్షం: ముంబైలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్ (3వ హన్షి కాటో కప్-2026)లో చేవెళ్లకు చెందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. ఆదివారం ముంబైలోని ములుండ్ వెస్ట్, కాళిదాస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ పోటీల్లో కరాటే మాస్టర్ కృష్ణ (సెన్సై) ఆధ్వర్యంలో జపాన్ షోటోకాన్ అసోసియేషన్ తరపున చేవెళ్ల విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-6 నుంచి అండర్-18 మరియు సీనియర్ విభాగాల్లో (కటా, ఫైట్) పోటీపడి ప్రథమ (గోల్డ్), ద్వితీయ (సిల్వర్), తృతీయ (బ్రాంజ్) స్థానాల్లో మొత్తం 8 పతకాలను కైవసం చేసుకున్నారు. ఇందులో కటా విభాగంలో సిద్ధూ, అశోక్ ప్రథమ స్థానాల్లో నిలిచి బంగారు పతకాలు సాధించగా, అశోక్ తన అద్భుత ప్రదర్శనతో 'గ్రాండ్ ఛాంపియన్‌షిప్' ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. అలాగే అండర్-12 ఫైట్ విభాగంలో సాత్విక్, అండర్-12 కటా విభాగంలో మణి దీక్షిత్, కౌశిక్, అండర్-6 విభాగంలో రోహన్ ద్వితీయ స్థానాల్లో నిలిచి 4 వెండి పతకాలు సాధించారు. అదేవిధంగా అండర్-10 విభాగంలో గౌతమ్ కుమార్, సీనియర్ విభాగంలో మల్లికార్జున (39) తృతీయ స్థానాల్లో నిలిచి 2 కాంస్య పతకాలు అందుకున్నారు. జపాన్, చైనా, రష్యా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, ఇండోనేషియా తదితర 10 దేశాల నుంచి సుమారు 3 వేల మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ మెగా టోర్నమెంట్‌లో చేవెళ్ల క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరిసి పతకాలు సాధించడంపై కరాటే మాస్టర్ కృష్ణ, క్రీడాకారుల తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ విజేతలను అభినందించారు.

మహేశ్వరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





బడంగ్పేట్, నవంబర్ 4 (విజన్ పక్షం): మహేశ్వరం నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రైడ్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్, గాంధీనగర్ జంక్షన్ నుండి బస్‌స్టాప్ వరకు సీసీ రోడ్డు, సబితా ఇంద్రారెడ్డి కాలనీ ఫేజ్-2లో సీసీ రోడ్డు, యూజీడీ పనులతో పాటు ఎంసీఆర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పనులను ఎటువంటి జాప్యం లేకుండా, నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

యాదవుల ఐక్యతే మన బలం: వల్లపు సుభాన్ యాదవ్



బడంగ్పేట్, నవంబర్ 4 (విజన్ పక్షం): హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో తెలంగాణ ప్రభుత్వం తరపున అనిల్ కుమార్ యాదవ్, అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యాదవ సదర్ సమ్మేళనం'లో మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వల్లపు సుభాన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుభాన్ యాదవ్ మాట్లాడుతూ.. యాదవుల ఐక్యత, ఆత్మగౌరవానికి సదర్ సమ్మేళనమే ప్రతీక అని పేర్కొన్నారు. వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ శ్రేయస్సు కోసం విభేదాలు పక్కనపెట్టి యాదవులంతా ఒక్కటిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో యువత నాయకత్వ బాధ్యతలు చేపట్టి సమాజానికి అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

అన్నదాత కళ్లలో ఆనందం.. ధాన్యం ధర ఆల్‌టైమ్ రికార్డు! ఏకంగా క్వింటా రూ.5,016!



తెలంగాణలో ధాన్యం ధరలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో జై శ్రీరామ్ రకం ధాన్యం క్వింటాకు ఏకంగా రూ.5,016 ధర పలికింది. అలాగే ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం క్వింటాకు రూ.4,200 ధర నమోదైంది. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మహబూబాబాద్: తెలంగాణలో ధాన్యం ధరలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో జై శ్రీరామ్ రకం ధాన్యం క్వింటాకు ఏకంగా రూ.5,016 ధర పలికింది. అలాగే ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం క్వింటాకు రూ.4,200 ధర నమోదైంది. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

మద్దతు ధర కంటే అధికంగా ధరలు

ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరతో పోలిస్తే కొన్ని రకాల ధాన్యానికి మార్కెట్‌లో అధిక ధరలు లభిస్తున్నాయి. సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.2,461, దొడ్డు రకానికి రూ.2,441 కనీస మద్దతు ధరగా ఉండగా, అదనంగా రూ.500 బోనస్ కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో లభిస్తున్న ధరలు రైతులకు ఊరటనిస్తున్నాయి.

బియ్యం ధరలపైనా ప్రభావం?

ధాన్యం ధరలు పెరగడంతో రాబోయే రోజుల్లో బియ్యం ధరలపైనా ప్రభావం పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో జై శ్రీరామ్ బియ్యం క్వింటాకు రూ.8,000 నుంచి రూ.9,000 వరకు పలుకుతోంది. ధాన్యం కొనుగోలు ధరలు మరింత పెరిగితే బియ్యం ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. మరోవైపు, ఎల్‌నినో ప్రభావం కారణంగా ధాన్యం ధరలు పెరుగుతున్నాయనే ప్రచారం ఉన్నప్పటికీ, ధరల పెరుగుదలకు అసలు కారణాలను నిర్ధారించేందుకు మార్కెట్ సరఫరా, డిమాండ్, దిగుబడి వంటి అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. మొత్తంగా కేసముద్రం మార్కెట్‌లో నమోదవుతున్న ధరలు రైతులు, వినియోగదారుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

అర్ధరాత్రి మీ అకౌంట్ నుంచి డబ్బులు కట్ అయ్యాయా..? ఉదయం వరకు ఆగకండి.. వెంటనే ఇలా చేస్తే..



అర్ధరాత్రి ఏదైనా బ్యాంక్ మోసం జరిగితే మీరు ఉదయం వరకు వేచి చూడక్కర్లేదు. మీరు ఉదయం వరకు వేచి చూడగానే వెంటనే బ్యాంక్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలి. దీని వల్ల నష్టాన్ని మీరు తగ్గించుకోవచ్చు. మీరు ఎలా ఫిర్యాదు చేయాలనేది ఇక్కడ చూద్దాం. అర్ధరాత్రి ఏదైనా సైబర్ మోసం లేదా మీకు తెలియకుండా ఇతర కారణాల మీ అకౌంట్ నుంచి డబ్బులు కట్ అయ్యాయా..? అయితే మీరు ఉదయం వరకు వేచి ఉండాల్సిన అవసరం లేదు. ఉదయం ఫిర్యాదు చేయవచ్చులే అని సైలెంట్‌గా ఉంటే మీరు మరింత మోసపోవచ్చు. దీంతో ఉదయం వరకు వేచి చూడకుండా వెంటనే ఫిర్యాదు చేయడం మంచిది. దీని వల్ల మీ నిధులను కాపాడుకోవడంతో పాటు తిరిగి పొందే అవకాశం ఉంటుంది. ఆర్బీఐ రూల్స్ ప్రకారం అనధికారిక లావాదేవీలు, మోసాలపై ఫిర్యాదు చేయడానికి బ్యాంకులు 24 గంటల పనిచేసే మార్గాలను కల్పించాలి. దీంతో కస్టమర్లు అర్ధరాత్రి వెంటనే బ్యాంక్ కస్టమర్ కేర్ నెంబర్లు, వెబ్ సైట్లు, యాప్‌ల ద్వారా ఫిర్యాదు చేయాలి. బ్యాంక్ సిబ్బందికి ఫిర్యాదు చేసిన తర్వాత రిఫరెన్స్ నెంబర్‌ను భద్రపర్చుకోండి. మీ డెబిట్ కార్డును బ్లాక్ చేయడం, యూపీఐ చెల్లింపులు తాత్కాలికంగా నిలిపివేసేలా బ్యాంక్ సిబ్బందిని రిక్వెస్ట్ చేయండి. దీంతో బ్యాంక్ సిబ్బంది మీ అకౌంట్ నుంచి లావాదేవీలు జరగకుండా తాత్కాలికంగా బ్లాక్ చేస్తారు. లేదా మీరే బ్యాంక్ ఫ్లాట్ ఫామ్స్ ద్వారా మీ డెబిట్ కార్డు లాక్ చేసుకోవడం, యూపీఐ లావాదేవీలు జరగకుండా లాక్ చేసుకోవడం లాంటివి చేసుకోవాలి. దీని వల్ల నష్టాన్ని తగ్గించుకోవచ్చు. అలాగే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయండి. సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. దీని వల్ల మీ డబ్బులను తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను మీ వద్ద ఉంచుకోండి. లావాదేవీల ఐడీలు, కచ్చితమైన టైమ్‌స్టాంప్‌లు, మీ హెచ్చరికలు, కస్టమర్ కేర్‌తో జరిపిన కాల్ లాగ్‌లను భద్రపరచుకోండి. మీరు ఫిర్యాదు చేయడానికి , బ్యాంక్ వేగంగా మీ ఫిర్యాదును ప్రాసెస్ చేయడానికి ఇవి ఉపయోగపడతాయి. మోసం జరిగిన మూడు రోజుల్లోగా మీరు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఆలస్యం చేస్తే నిధులు తిరిగి పొందటంలో జాప్యం జరుగుతుంది. అర్ధరాత్రి మోసం జరిగితే ముందుగా కస్టమర్ కేర్ లేదా బ్యాంకింగ్ ప్లాట్‌ఫామ్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత ఉదయం బ్యాంక్ బ్రాంచ్‌కి వెళ్లండి. మీకు జరిగిన సైబర్ మోసం గురించి వివరించండి. దీని వల్ల మీ ఫిర్యాదు వేగంగా పరిష్కారం అయ్యే అవకాశాలు ఉంటాయి. మోసం పెద్దది అయితే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడం వల్ల త్వరగా మీకు పరిష్కారం లభిస్తుంది.

జియో ఐపీఓ సరికొత్త రికార్డ్.. ప్రపంచంలోనే ఇదే తొలిసారి..

జియో ఐపీఓ సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రపంచంలోనే అత్యధిక మంది పాల్గొన్న ఐపీఓగా రికార్డు సొంతం చేసుకుంది. మూడో రోజు ముగిసే సమయానికి జియో ఐపీఓకు 1.38 కోట్లకుపైగా దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు ఏ కంపెనీకి ఇంత పెద్ద మొత్తంలో సబ్‌స్క్రైబర్లు రాలేదు. గత కొద్ది రోజుల క్రితం మార్కెట్లోకి వచ్చిన జియో ఐపీఓ చరిత్రలో సరికొత్త చరిత్రకు నాంది పలికింది. ప్రపంచంలోనే ఎక్కువమంది పాల్గొన్న అదిపెద్ద ఐపీఓగా రికార్డు నెలకొల్పింది. మూడో రోజు ముగిసే సమయానికి 1.38 కోట్లకుపైగా దరఖాస్తులు రాగా.. ఏకంగా రూ.7 లక్షల కోట్లకు పైగా డిమాండ్ వచ్చింది. ఐపీఓ మొత్తం 22.2 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. జియో జారీ చేసిన 27 కోట్ల షేర్ల కోసం మొత్తం 655.68 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. యాంకర్ బుక్ సబ్‌స్క్రిప్షన్ 30 రెట్లు దాటగా.. మొత్తం ఐపీఓ బుక్‌కు 22.2 రేట్లు డిమాండ్ వచ్చింది. QIB విభాగం 70.55 రెట్లు, చీ×× విభాగం 14 రెట్లు, రిటైల్ విభాగం, 2.72 రెట్లు, ఉద్యోగుల విభాగం 2.93 రెట్లు, షేర్‌హోల్డర్ల విభాగం 7.6 రెట్లు సబ్‌స్క్రైబ్ చేశారు. జియో ఐపీఓ పరిమాణం రూ.30,213 కోట్లుగా ఉండగా.. భారత క్యాపిటల్ మార్కెట్ హిస్టరీలో ఇదే అతిపెద్ద ఐపీఓగా నిలిచిందని చెప్పవచ్చు. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ విలువ రూ.10.3 లక్షల కోట్లుగా ఉండే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో లిస్టింగ్ సమయంలో సుమారు 15 శాతం లాభాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ అంచనా ప్రకారం లిస్టింగ్ రోజు జియో ప్లాట్‌ఫామ్స్ భారత్‌లో రెండో అత్యంత విలువైన కంపెనీగా నిలిచే అవకాశం ఉందని చెబుతున్నారు. రానున్న రోజుల్లో జియో ప్లాట్‌ఫామ్స్ సరికొత్త చరిత్ర సృష్టించనున్నాయని ఐపీఓకు వచ్చిన స్పందన చూస్తే తెలుస్తోంది. 2020లో 13 మంది వ్యూహాత్మక పెట్టుబడిదారులు, ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడిదారుల నుండి 20 బిలియన్ డాలర్లను సమీకరించి అప్పట్లో రికార్డు నమోదు చేసిన జియో.. ఇప్పుడు ఈ ఐపీఓ ద్వారా అతిపెద్ద పబ్లిక్ మార్కెట్ నిధుల సమీకరించి కొత్త రికార్డును నెలకొల్పింది. ఇష్యూ ప్రారంభమైన 100 నిమిషాల్లోనే మొత్తం సబ్‌స్క్రైబ్ అయిపోయి అత్యంత వేగంగా సబ్‌స్క్రిప్షన్ పొందిన ఐపీఓగా రికార్డ్ నమోదు చేసింది. రూ. 5,500 కోట్ల×దీ వాటా తొలి 10 నిమిషాల్లోనే పూర్తిగా సబ్‌స్క్రైబ్ అవ్వగా.. అన్ని పెట్టుబడిదారుల వర్గాలలో కనీసం 2 రెట్ల సబ్‌స్క్రిప్షన్‌ను పొందిన ఏకైక ఐపీఓగా నిలిచింది.అయితే జియో ఐపీఓకు సంబంధించి కేటాయింపుల ప్రాతిపదిక అక్టోబర్ 26న జరగనుండగా.. అక్టోబర్ 27న విజయవంతమైన దరఖాస్తుదారుల డీమ్యాట్ ఖాతాలకు షేర్లను జమ చేయనున్నారు. అక్టోబర్ 28న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో జియో ప్లాట్‌ఫామ్ లిస్ట్ కానుంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ జీఎంపీ ఈ రోజు ఒక్కో షేరుకు రూ. 238గా ఉంది.

కేవలం రూ.200కే 30GB డేటా, 20కిపైగా OTTలు, యూట్యూబ్ ప్రీమియం..!



రీఛార్జ్ చేసిన తర్వాత, వినియోగదారులు ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్ లేదా ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ ప్లాన్‌ల వెబ్‌సైట్ ద్వారా యూట్యూబ్ ప్రీమియంను మాన్యువల్‌గా క్లెయిమ్ చేసుకోవాలి. వారు రివార్డ్స్, గ్రూం విభాగానికి వెళ్లి, యూట్యూబ్ ప్రీమియంను కనుగొని, క్లెయిమ్ ఆప్షన్‌ను ట్యాప్ చేయవచ్చు. ఈ సబ్‌స్క్రిప్షన్ ప్యాక్ 28 రోజుల వ్యాలిడిటీ వరకు ఉంటుంది. దీనిని ఉపయోగించడం కొనసాగించడానికి, వినియోగదారులు మళ్లీ రీఛార్జ్ చేసి, ఈ ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోవాలి. సినిమాలు, షోలు స్ట్రీమింగ్ చేసేంత సమయాన్నే యూట్యూబ్ చూసే ప్రీపెయిడ్ వినియోగదారుల కోసం ఎయిర్‌టెల్ మరో ఆఫ్షన్‌ను అందిస్తోంది. ఈ టెలికాం ఆపరేటర్ రూ. 200 ఎంటర్‌టైన్‌మెంట్ టాప్-అప్‌ను ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా యూట్యూబ్ ప్రీమియంతో పాటు 30+దీ డేటా, 28 రోజుల పాటు 20కి పైగా గ్రూం ప్లాట్‌ఫామ్‌లకు యాక్సెస్ లభిస్తుంది. ఈ కొత్త ప్యాక్ ఒక నెల జియోహాట్‌స్టార్ యాక్సెస్‌ను అందించే ఎయిర్‌టెల్ ఇటీవలి రూ. 48 రీఛార్జ్ ప్యాక్‌ను అనుసరిస్తుంది. ఈ తాజా ఆఫర్, యూట్యూబ్ పెయిడ్ సబ్‌స్క్రిప్షన్‌ను అనేక స్ట్రీమింగ్ సేవలతో ఒకే రీఛార్జ్‌లో బండిల్ చేయడం ద్వారా విస్తృతమైన విధానాన్ని అవలంబిస్తుంది. అయినప్పటికీ ఇది సాధారణ ప్రీపెయిడ్ ప్లాన్‌కు ప్రత్యామ్నాయం కాదు.

ఎయిర్‌టెల్ రూ. 200 టాప్-అప్ ప్యాక్ ప్రయోజనాలు:

రూ. 200 ప్యాక్‌లో 30+దీ హై-స్పీడ్ డేటా, 28 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. దీని ప్రధాన ఆకర్షణ యూట్యూబ్ ప్రీమియం. ఇది వీడియోల నుండి యాడ్స్‌ను తొలగించి, బ్యాక్‌గ్రౌండ్ ప్లేబ్యాక్, ఆఫ్‌లైన్ డౌన్‌లోడ్స్‌ను అందిస్తుంది. సబ్‌స్క్రైబర్‌లకు యూట్యూబ్ మ్యూజిక్ ప్రీమియం కూడా అందుబాటులో ఉంటుంది. ఈ గ్రూం బండిల్‌లో ప్రైమ్ వీడియో, జియోహాట్‌స్టార్, జీ5 ప్రీమియం, సోనీలివ్‌లతో పాటు మరో 18కి పైగా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు కూడా ఉన్నాయి. ప్రతి సర్వీస్‌కు విడివిడిగా డబ్బు చెల్లించే బదులు, యూట్యూబ్, పలు స్ట్రీమింగ్ యాప్‌ల మధ్య మారే వినియోగదారులకు ఈ ప్యాక్ ఉపయోగకరంగా ఉంటుంది. అయితే, ఇందులో ఒక ముఖ్యమైన మెలిక ఉంది. ఈ రూ. 200 రీఛార్జ్ అనేది ఒక ఎంటర్‌టైన్‌మెంట్ యాడ్-ఆన్ మాత్రమే. ప్రత్యేక ప్రీపెయిడ్ ప్లాన్ కాదు. దీనిలో కాలింగ్ లేదా గ్రామీ ప్రయోజనాలు ఉండవు. అందుకే దీనిని ఉపయోగించడానికి వినియోగదారులు తప్పనిసరిగా యాక్టివ్ ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ బేస్ ప్లాన్‌ను కలిగి ఉండాలి. రీఛార్జ్ చేసిన తర్వాత, వినియోగదారులు ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్ లేదా ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ ప్లాన్‌ల వెబ్‌సైట్ ద్వారా యూట్యూబ్ ప్రీమియంను మాన్యువల్‌గా క్లెయిమ్ చేసుకోవాలి. వారు రివార్డ్స్, గ్రూం విభాగానికి వెళ్లి, యూట్యూబ్ ప్రీమియంను కనుగొని, క్లెయిమ్ ఆప్షన్‌ను ట్యాప్ చేయవచ్చు. ఈ సబ్‌స్క్రిప్షన్ ప్యాక్ 28 రోజుల వ్యాలిడిటీ వరకు ఉంటుంది. దీనిని ఉపయోగించడం కొనసాగించడానికి, వినియోగదారులు మళ్లీ రీఛార్జ్ చేసి, ఈ ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోవాలి.

ఎయిర్‌టెల్ రూ. 200 ప్యాక్ ప్రయోజనకరమేనా?

భారతదేశంలో యూట్యూబ్ ప్రీమియం వ్యక్తిగత ప్లాన్ ధర నెలకు సుమారు రూ. 149. రూ. 200 ధర కలిగిన ఎయిర్‌టెల్ ప్యాక్, కేవలం రూ. 51 మాత్రమే ఎక్కువ. దీనితో పాటు 30+దీ డేటా, పలు గ్రూం ప్లాట్‌ఫారమ్‌లకు యాక్సెస్ కూడా లభిస్తుంది. అందువల్ల ఇప్పటికే యూట్యూబ్ ప్రీమియం సబ్‌స్క్రైబర్లుగా ఉన్నవారు ఈ బండిల్డ్ సేవలను కూడా ఉపయోగించుకోవచ్చు. అలాగే దీనిని పరిగణనలోకి తీసుకోవడం మంచిది. అయితే, దీని విలువ వినియోగదారులు వాస్తవానికి ఏ ప్లాట్‌ఫారమ్‌లను చూస్తారు? వారి ప్రస్తుత ప్రీపెయిడ్ ప్లాన్ ఇప్పటికే తగినంత డేటాను అందిస్తుందా అనే దానిపై ఆధారపడి ఉంటుంది. ప్రధానంగా యూట్యూబ్ ప్రీమియం కోరుకునే వారికి డైరెక్ట్ సబ్‌స్క్రిప్షన్ సులభంగా ఉండవచ్చు. అదే సమయంలో ఫ్లిప్‌కార్ట్ బ్లాక్ సభ్యులు తమ సభ్యత్వంలో భాగంగా ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా ఒక సంవత్సరం యూట్యూబ్ ప్రీమియంను కూడా పొందవచ్చు. క్రమం తప్పకుండా వీడియోలు చూసే, వివిధ సర్వీసులలో కంటెంట్‌ను స్ట్రీమ్ చేసే ఎయిర్‌టెల్ వినియోగదారులకు, ఈ కొత్త టాప్-అప్ ఒక సౌకర్యవంతమైన బండిల్‌ను అందిస్తుంది. కేవలం మొబైల్ డేటా మాత్రమే అవసరమైన వారు లేదా ఇప్పటికే ప్లాన్‌లో ఉన్న గ్రూం సబ్‌స్క్రిప్షన్‌ల కోసం చెల్లిస్తున్న వారు దీని నుండి తక్కువ ప్రయోజనం పొందవచ్చు.

భారతీయ బ్రాండ్ స్మార్ట్‌ఫోన్లు వచ్చేస్తున్నాయి..! ఆపిల్, శాంసంగ్‌కు పోటీగా దేశీయ కంపెనీలు!

స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో భారత్ మరో కీలక అడుగు వేయడానికి సిద్ధమవుతోంది. ఇప్పటివరకు విదేశీ బ్రాండ్ల ఆధిపత్యం కొనసాగుతున్న మొబైల్ రంగంలో సొంత డిజైన్, సొంత బ్రాండ్‌తో అంతర్జాతీయ స్థాయిలో పోటీపడాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2028 అక్టోబర్ 23 నాటికి భారతీయ డిజైన్‌తో, దేశంలోనే తయారైన భారతీయ బ్రాండెడ్ మొబైల్ ఫోన్లు అందుబాటులోకి వస్తాయని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో భారత్ మరో కీలక అడుగు వేయడానికి సిద్ధమవుతోంది. ఇప్పటివరకు విదేశీ బ్రాండ్ల ఆధిపత్యం కొనసాగుతున్న మొబైల్ రంగంలో సొంత డిజైన్, సొంత బ్రాండ్‌తో అంతర్జాతీయ స్థాయిలో పోటీపడాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2028 అక్టోబర్ 23 నాటికి భారతీయ డిజైన్‌తో, దేశంలోనే తయారైన భారతీయ బ్రాండెడ్ మొబైల్ ఫోన్లు అందుబాటులోకి వస్తాయని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఆపిల్, శాంసంగ్ వంటి దిగ్గజ కంపెనీలకు దీటుగా భారతీయ సంస్థలను తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

భారతీయ డిజైనర్లకు సవాలు.. ఇప్పటికే కీలక పురోగతి

ఢిల్లీలో జరిగిన ప్రముఖ ఛానల్ సమ్మిట్‌లో మాట్లాడిన అశ్విని వైష్ణవ్.. స్మార్ట్‌ఫోన్ తయారీ వెనుక ఉన్న సాంకేతిక సంక్లిష్టతలను వివరించారు. చిన్న పరికరంలోనే యాంటెన్నా, రేడియో ఫ్రీక్వెన్సీ కమ్యూనికేషన్, ప్రాసెసింగ్ వ్యవస్థ, మెమరీ, కెమెరా, డిస్‌ప్లే, పవర్ మేనేజ్‌మెంట్ వంటి అనేక భాగాలను సమర్థంగా అమర్చాల్సి ఉంటుందని చెప్పారు. మూడేళ్ల క్రితం భారతీయ డిజైనర్లకు మొబైల్ ఫోన్ మదర్‌బోర్డ్‌గా పనిచేసే ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ (పీసీబీ)ను రూపొందించాలని సవాలు విసిరినట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రయత్నంలో రెండు భారతీయ సంస్థలు ముందుకొచ్చి 5+ మొబైల్ ఫోన్ పీసీబీలను రూపొందించాయని వెల్లడించారు. వాటిలో ఒక సంస్థ రూపొందించిన డిజైన్‌ను అమెరికాలోని ప్రముఖ టెలికాం సర్వీస్ ప్రొవైడర్ ఎంపిక చేసుకుందని, ఆ సంస్థకు సంబంధించిన ఫోన్ ఇప్పటికే తయారై వినియోగదారులకు చేరిందని పేర్కొన్నారు.



భారతీయ మేధో సంపత్తికి ప్రాధాన్యం

ఇప్పటివరకు విదేశీ సంస్థల సాంకేతికత, బ్రాండ్లపై ఆధారపడిన భారత్.. ఇకపై సొంత డిజైన్, సొంత మేధో సంపత్తి, దేశీయ బ్రాండ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టనుందని మంత్రి చెప్పారు. దేశంలో అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానం భారత్‌లోనే ఉండేలా చర్యలు తీసుకోవడం ఈ ప్రణాళికలో కీలకమని వివరించారు.

ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లోనూ దూకుడు

గత కొన్నేళ్లలో మొబైల్ ఫోన్లు, డ్రోన్లు, క్షిపణులు, రైళ్ల సహా వివిధ సాంకేతిక ఉత్పత్తుల తయారీలో భారత్ సామర్థ్యం పెంచుకుందని అశ్విని వైష్ణవ్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ ప్రస్తుతం దేశ ఎగుమతుల్లో మూడో స్థానంలో ఉందని, త్వరలో రెండో స్థానానికి చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2028 లక్ష్యం నెరవేరితే ప్రపంచ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో భారతీయ బ్రాండ్లకు కొత్త అవకాశాలు ఏర్పడవచ్చు. అయితే, ఆపిల్, శాంసంగ్‌లతో పోటీ పడాలంటే నాణ్యత, ధర, సాంకేతికత, సాఫ్ట్‌వేర్ మద్దతు, ప్రపంచవ్యాప్త మార్కెటింగ్ వంటి అంశాల్లోనూ దేశీయ సంస్థలు తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

కేంద్రం నుంచి బెస్ట్ స్కీమ్.. రూ.15,000 టూల్‌కిట్ సాయం, రూ.3 లక్షల వరకు రుణం..!



కేంద్ర ప్రభుత్వం సంప్రదాయ చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా అర్హులైన చేతివృత్తుల వారికి నైపుణ్య శిక్షణతో పాటు పనిముట్ల కొనుగోలుకు ఆర్థిక సాయం, సొంతంగా వ్యాపారం. చేతివృత్తులు చేసుకునే వారికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం విశ్వకర్మ యోజన ద్వారా శిక్షణ, రోజుకు రూ.500 స్టైపెండ్, పనిముట్ల కొనుగోలుకు రూ.15,000 వరకు ఆర్థిక సాయం, తక్కువ వడ్డీకి రుణం పొందే అవకాశం ఉంది. ఈ పథకానికి ఎవరు అర్హులు? ఎలా దరఖాస్తు చేసుకోవాలి? సమస్యలు వస్తే ఎక్కడ సంప్రదించాలి? పూర్తి వివరాలు తెలుసుకుందాం. కేంద్ర ప్రభుత్వం సంప్రదాయ చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా అర్హులైన చేతివృత్తుల వారికి నైపుణ్య శిక్షణతో పాటు పనిముట్ల కొనుగోలుకు ఆర్థిక సాయం, సొంతంగా వ్యాపారం చేసుకోవడానికి రుణ సదుపాయం కల్పిస్తున్నారు. తమ వృత్తిని అభివృద్ధి చేసుకోవాలనుకునే వారికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది.

పీఎం విశ్వకర్మ యోజన ద్వారా కలిగే ప్రయోజనాలు ఏమిటి?

ఈ పథకం కింద అర్హత సాధించిన లబ్ధిదారులకు పలు ప్రయోజనాలు అందిస్తారు.

1. శిక్షణ సమయంలో రోజుకు రూ.500: లబ్ధిదారులకు వారి వృత్తికి సంబంధించిన నైపుణ్య శిక్షణ అందిస్తారు. శిక్షణ కాలంలో నిబంధనలకు అనుగుణంగా రోజుకు రూ.500 స్టైపెండ్ చెల్లిస్తారు.

2. పనిముట్ల కొనుగోలుకు రూ.15,000 వరకు సాయం: వృత్తికి అవసరమైన పనిముట్లు కొనుగోలు చేసేందుకు అర్హులైన లబ్ధిదారులకు రూ.15,000 వరకు టూల్‌కిట్ ప్రోత్సాహక సాయం అందిస్తారు.

3. సొంత వ్యాపారం కోసం రూ.3 లక్షల వరకు రుణం: ఈ పథకం కింద అర్హులైన వారికి రెండు దశల్లో రుణ సదుపాయం కల్పిస్తారు.

మొదటి దశ: రూ.1 లక్ష వరకు రుణం.

రెండో దశ: రూ.2 లక్షల వరకు అదనపు రుణం.

మొదటి దశ రుణాన్ని 18 నెలల వ్యవధిలో, రెండో దశ రుణాన్ని 30 నెలల వ్యవధిలో తిరిగి చెల్లించే అవకాశం ఉంటుంది. అయితే రెండో దశ రుణం పొందడానికి పథకం నిబంధనలు, అర్హతలు వర్తిస్తాయి. ఈ రుణాలు తక్కువ వడ్డీ రేటుతో అందించేలా పథకాన్ని రూపొందించారు.

పీఎం విశ్వకర్మ యోజనకు ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చు?

సంప్రదాయ చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారు ఈ పథకానికి అర్హత పొందే అవకాశం ఉంది. ప్రధానంగా ఈ కింది వృత్తులకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు:

1. వడ్రంగులు
2. కమ్మరులు
3. స్వర్ణకారులు
4. కుమ్మరులు
5. చెప్పులు కుట్టేవారు, చెప్పుల తయారీదారులు
6. దర్జీలు
7. క్షురకులు
8. చాకళ్లు
9. తాళాలు తయారు చేసేవారు
10. శిల్పులు, రాతి శిల్పకారులు
11. రాతి పనివారు
12. రాజమేస్త్రీలు
13. బుట్టలు, చాపలు, చీపుర్లు తయారు చేసేవారు
14. బొమ్మలు, సంప్రదాయ ఆటవస్తువులు తయారు చేసేవారు
15. పడవలు తయారు చేసేవారు
16. చేపలు పట్టే వలలు తయారు చేసేవారు
17. సుత్తులు, ఇతర సంప్రదాయ పనిముట్లు తయారు చేసేవారు
18. పూలదండలు తయారు చేసేవారు.

గమనిక: పై వృత్తుల్లో ఉండటం మాత్రమే సరిపోదు. వయస్సు, కుటుంబానికి సంబంధించిన నిబంధనలు, ఇతర అర్హత ప్రమాణాలు కూడా వర్తిస్తాయి. దరఖాస్తు చేయడానికి ముందు అధికారిక మార్గదర్శకాలను పరిశీలించాలి.

పీఎం విశ్వకర్మ యోజనకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

ఈ పథకానికి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దరఖాస్తు ప్రక్రియలో అవసరమైన వివరాలను అందించాలి.

దరఖాస్తు విధానం:

1. అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి: పీఎం విశ్వకర్మ పథకానికి సంబంధించిన అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి. అధికారిక వెబ్‌సైట్: PM Vishwakarma అధికారిక పోర్టల్

2. సమీపంలోని సీఎస్‌సీ కేంద్రాన్ని సంప్రదించండి: మీకు స్వయంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం తెలియకపోతే సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ (జూజ)కు వెళ్లి సహాయం తీసుకోవచ్చు.

Flat No: G-2, Mount Nasir Apartment, 6-1-57 to 61, Saifabad, Hyderabad9441221980